జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 30 | జులై | 2026 ◆ పేజీలు : 7

# ఎస్ఐఆర్ కార్యక్రమంలో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి




- బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాలను ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా పునః ధృవీకరణ చేయాలి
- ఓటరు జాబితాకు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి

2 లో...

● విధుల పేరుతో వేధింపులా..? ● కార్మికుల్లో తీవ్ర ఆందోళన ● కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆరోపణలు ● 60 ఏళ్లు దాటిన కార్మికులపై అజమాయిషీ? ● విధుల సమయంలో ఫోటోలు, వీడియోలు తీస్తున్న ఓ అధికారి? ● మానసిక ఒత్తిడితో ఆందోళన చెందుతున్న కార్మికులు! ● ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్న పరిస్థితి! ● ఇదెక్కడి తీరు అంటూ ప్రశ్నిస్తున్న కార్మికులు ● అధికారుల ప్రవర్తన మార్చుకోవాలని విజ్ఞప్తి ● ఆందోళనకు సిద్ధమవుతున్న పలువురు కార్మికులు ● కార్మిక సంఘాల వైఖరిపై చర్చ ● కార్మికులకు అండగా నిలుస్తారా.. అధికారులకే మద్దతా?




2 లో..

# కార్మికులపై.... అధికారి దౌర్జన్యం...?

● ఇల్లందు, ప్రజాజ్యోతి

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలో పనిచేస్తున్న కార్మికుల పట్ల ఓ అధికారి వ్యవహరిస్తున్న తీరు తీవ్ర చర్చకు దారితీసినట్లు సమాచారం. విధులు నిర్వహిస్తున్న కార్మికులను అనవసరంగా ప్రశ్నించడం, ఒత్తిడికి గురి చేయడం, ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన కార్మికులపైనే ఎక్కువగా అజమాయిషీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధుల సమయంలో ఫోటోలు, వీడియోలు తీస్తున్నట్లు ప్రచారం కార్మికుల్లో ఆందోళన కలిగిస్తుంది. దీనివల్ల తమపై అనవసర ఒత్తిడి పెరుగుతుందని కొందరు కార్మికులు వాపోతున్నట్లు తెలుస్తుంది.

# చిక్కిన మావోయిస్టు అగ్రనేత..!



- జార్ఖండ్‌లో సీఆర్పీఎఫ్ కోబ్రా-209 బెటాలియన్‌కు భారీ విజయం
- కోటి రూపాయల రివార్డు ఉన్న సీపీఐ (మావోయిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్రా అరెస్టు
- మరో ఇద్దరు మావోయిస్టులు మోచు, గౌరవ్ హన్స్‌దాలు కూడా అదుపులోకి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 29, ప్రజాజ్యోతి ;** దేశవ్యాప్తంగా మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లలో భద్రతా బలగాలకు కీలక విజయంగా భావిస్తున్న పరిణామంలో సీపీఐ (మావోయిస్టు) అగ్రనేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్రా జార్ఖండ్‌లో అరెస్టయ్యాడు. సీఆర్పీఎఫ్ కోబ్రా-209 బెటాలియన్, జార్ఖండ్ పోలీసుల సంయుక్త చర్యల్లో ధన్‌బాద్ జిల్లా పరిధిలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు మోచు, గౌరవ్ హన్స్‌దాలు అనే మరో ఇద్దరు మావోయిస్టులను కూడా భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. మిసిర్ బెస్రా సీపీఐ (మావోయిస్టు)

మిగతా 2 లో...

# ఆప్మెల్‌లో 'సోలార్' వెలుగు



- 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించిన సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి
- ఏడాదికి రూ.24 లక్షల విద్యుత్ ఖర్చు ఆదా.. రూ.23.33 కోట్ల రికార్డు నికర లాభంపై హర్షం
- స్వర్ణోత్సవ సంవత్సరంలో వ్యాపార విస్తరణకు దిశానిర్దేశం

2 లో...


మంగలిగుట్టలో ఇసుక తవ్వకాలు
అక్రమమా... సక్రమమా..?


ప్రజాజ్యోతి
ఇసుక మేటల పేరుతో తవ్వకాలా...?



# ముగ్గు ఎందుకు పోశారు... మాటెందుకు మార్చారు...?

- మంగలిగుట్ట ఇసుక రాశులపై ద్వంద వైఖరి ఎవరికోసం....?
- అధికారుల తీరు హాస్యాస్పదం...

**ములకలపల్లి, జూలై 29 (ప్రజాజ్యోతి):**
మంగలిగుట్ట పాములేరు వాగులో ఇసుక తవ్వకాలు, భారీగా నిల్వ చేసిన ఇసుక రాశులపై ప్రజాజ్యోతి కథనాలు, ప్రజాప్రతినిధుల ఫిర్యాదుల నేపథ్యంలో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు బుధవారం స్పందించారు. గిర్దావర్ రాంబాబు ఘటనాస్థలికి వెళ్లి ఇసుక రాశులను పరిశీలించి ముగ్గు వేసినట్లు సమాచారం. అయితే, తహశీల్దార్ మాత్రం గురువారం మైనింగ్ అధికారులు అనుమతులు, సర్వే సరిహద్దులను పరిశీలించిన తర్వాతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో అనుమతులు లేకుండానే తవ్వకాలు జరిగాయా? అనుమతులు ఉంటే ముగ్గు ఎందుకు పోశారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇసుక రాశులకు ముగ్గు వేయడం ఒకవైపు, మైనింగ్ శాఖ నివేదిక తర్వాతే చర్యలు అంటుండటం అధికారుల మధ్య సమన్వయ లోపాన్ని బయట పెడుతోందని స్థానికులు అంటున్నారు. అనుమతులు, తవ్వకాల పరిమితి, నిల్వల చట్టబద్ధతపై జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆప్మెల్‌లో 'సోలార్' వెలుగు



**కొత్తగూడెం (సింగరేణి), జూలై 29, ప్రజాజ్యోతి ;** సింగరేణి అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఆప్మెల్) స్వర్ణోత్సవాల సందర్భంగా విజయవాడ ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అదే సందర్భంగా ప్లాంట్‌లో నూతనంగా నిర్మించిన సీసీ, ఆర్‌సీసీ రహదారులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో సింగరేణితో పాటు ఆప్మెల్‌ను బహుముఖ వ్యాపార సంస్థగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 50 ఏళ్ల ఆప్మెల్ చరిత్రలో తొలిసారిగా రూ.63.13 కోట్ల టర్నోవర్, రూ.23.33 కోట్ల నికర లాభం సాధించడం సంస్థ ఉద్యోగుల సమిష్టి కృషికి నిదర్శనమని అభినందించారు. గత ఏడాది ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆప్మెల్‌ను సందర్శించిన సందర్భంగా ఇచ్చిన సూచనల మేరకు ప్లాంట్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. అందులో భాగంగానే సీసీ, ఆర్‌సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 1, 1976న ప్రారంభమైన ఆప్మెల్ ఈ ఏడాది స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో, ప్రస్తుతం తయారు చేస్తున్న యంత్ర పరికరాలు, విడిభాగాలతో పాటు వివిధ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త ఉత్పత్తుల తయారీ, వ్యాపార విస్తరణపై దృష్టి సారించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో సింగరేణి పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

**ఏడాదికి రూ.24 లక్షల విద్యుత్ ఖర్చు ఆదా**

ఆప్మెల్ ప్లాంట్, కాలనీ అవసరాలకు ప్రతి ఏడాది సుమారు రూ.60 లక్షలు విద్యుత్ బిల్లుల రూపంలో ఖర్చవుతున్నాయి. రూ.1.24 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ద్వారా ఏటా రూ.24 లక్షల వరకు విద్యుత్ ఖర్చు ఆదా కానుంది. ఐదేళ్లలో పెట్టుబడి వ్యయం పూర్తిగా తిరిగి వస్తుందని అధికారులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ ప్రాజెక్టు దోహదపడనుంది. ఆప్మెల్ చైర్మన్ ఎన్‌వీకే శ్రీనివాస్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి చేపట్టనున్న భవిష్యత్ కార్యాచరణను వివరించారు. సింగరేణి, కోల్ ఇండియా, ఎన్ఎండీసీ సంస్థల నుంచి లభించిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం. తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్ పాల్గొన్నారు. విజయవాడలోని ఆప్మెల్ నుంచి ఎండీ ఎర్రన్నతో పాటు అధికారులు, ఉద్యోగులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

## చిక్కిన మావోయిస్టు అగ్రనేత..!

(మొదటి పేజీ తరువాయి...)

కేంద్ర నాయకత్వంలో కీలక వ్యక్తిగా కొనసాగుతున్నాడు. అతనిపై రూ.1 కోటి రివార్డు ప్రకటించడంతో పాటు జార్ఖండ్, బీహార్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో నమోదైన 141కు పైగా కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. దశాబ్దాలుగా మావోయిస్టు కార్యకలాపాలను నడిపించిన అతడు భద్రతా బలగాలకు అత్యంత వాంఛనీయ నక్సలైట్ నేతగా గుర్తింపు పొందాడు. ఇటీవలి కాలంలో జార్ఖండ్‌లో మావోయిస్టులపై భద్రతా బలగాలు విస్తృత స్థాయిలో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా సరండా అటవీ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని సాగిన కూంబింగ్ చర్యలు మావోయిస్టు నెట్‌వర్క్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. పలువురు మావోయిస్టులు లొంగిపోగా, మరికొందరు అరెస్టు కావడంతో సంస్థ కార్యకలాపాలు బలహీనపడుతున్నాయని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మిసిర్ బెస్రా అరెస్టు మావోయిస్టు ఉద్యమానికి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. అరెస్టయిన ముగ్గురిని భద్రతా సంస్థలు విచారిస్తున్నాయి. వారి నుంచి మావోయిస్టు కేంద్ర నాయకత్వం, ఆయుధాల నిల్వలు, నిధుల సమీకరణ, మిగిలిన క్యాడర్ కదలికలు, భవిష్యత్ వ్యూహాలకు సంబంధించిన కీలక సమాచారం లభించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఈ అరెస్టుతో జార్ఖండ్‌తో పాటు తూర్పు భారతదేశంలో మావోయిస్టు వ్యతిరేక చర్యలకు మరింత ఊతం లభించే అవకాశం ఉందని భద్రతా వర్గాలు పేర్కొంటున్నాయి.

# కార్మికులపై అధికారి దౌర్జన్యం..?

**ఇల్లందు, జులై 29 (ప్రజాజ్యోతి)** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలో పనిచేస్తున్న కార్మికుల పట్ల ఓ అధికారి వ్యవహరిస్తున్న తీరు తీవ్ర చర్చకు దారితీసినట్లు సమాచారం. విధులు నిర్వహిస్తున్న కార్మికులను అనవసరంగా ప్రశ్నించడం, ఒత్తిడికి గురిచేయడం, ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన కార్మికుల పైనే ఎక్కువగా అజమాయిషీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధుల సమయంలో ఫోటోలు, వీడియోలు తీస్తున్నట్లు ప్రచారం కార్మికుల్లో ఆందోళన కలిగిస్తుంది. దీనివల్ల తమపై అనవసర ఒత్తిడి పెరుగుతుందని కొందరు కార్మికులు వాపోతున్నట్లు తెలుస్తుంది. సదరు అధికారి కావాలనే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, తమకు 60 ఏళ్ళు వచ్చాయని, కొన్ని ఏళ్ళుగా సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టినప్పటికీ పదవి విరమణ సమయంలో ఎలాంటి కనికరం లేకుండా వ్యవహరించడం ఏమిటని కార్మికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

**మానసికంగా కుంగిపోతున్న కార్మికులు**

రోజువారీ విధుల్లోనే ఒత్తిడిని ఎదుర్కొంటున్న కార్మికులు, అధికారుల వ్యవహారశైలి కారణంగా మరింత మానసిక ఆందోళనకు గురవుతున్నారని సమాచారం. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొన్నట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది.

**ఇదెక్కడి తీరు..?**

సింగరేణి సంస్థలో ఉద్యోగుల పట్ల ఓ అధికారి వైఖరి సరైనదేనా అంటూ కార్మికులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. పరస్పర గౌరవంతో వ్యవహరించాల్సిన అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రవర్తన మార్చుకోవాలంటున్న కార్మికులు**

సదరు అధికారి తన వ్యవహారశైలిని మార్చుకుని కార్మికులతో సానుకూలంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నట్లు తెలుస్తుంది. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని సూచిస్తున్నారు. పరిస్థితిలో మార్పు రాకపోతే ఆందోళన బాట పట్టేందుకు కొందరు కార్మికులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ అంశంపై కార్మిక సంఘాలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

**కార్మిక సంఘాల వైఖరి ఏంటి?**

కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఓ అధికారి వ్యవహారంలో కార్మిక సంఘాలు కార్మికుల పక్షాన నిలుస్తాయా? లేక అధికారుల వైఖరికి మద్దతు ఇస్తాయా? అనే చర్చ సంస్థలో జోరుగా సాగుతుంది. కార్మికుల సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. లేని యెడల ఆందోళన చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇకనైనా ఆ అధికారి తీరు మార్చుకుంటాడా లేక అదేవిదంగానే కొనసాగిస్తాడా అనేది వేచి చూడాల్సిందే.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 29, (ప్రజా జ్యోతి)** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు కొద్ది రోజులే మిగిలి ఉన్న నేపథ్యంలో ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు నమోదు చేసిన వివరాల్లో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, డేటా నమోదు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) తదితర అంశాలపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ కార్యక్రమంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు నాలుగు నుంచి ఐదు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున బీఎల్‌వోలు సేకరించిన అన్ని ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు వెబ్‌సైట్‌లో ఓటర్ల వివరాలు నమోదు చేసే సమయంలో కొన్ని పొరపాట్లు చోటుచేసుకున్నట్లు గుర్తించామని, వాటి కారణంగా అర్హులైన ఓటర్ల వివరాల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రతి నమోదును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. బీఎల్‌వోలు నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు , అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు , సూపర్‌వైజర్లు తప్పనిసరిగా పునః ధృవీకరణ చేయాలని, యాదృచ్ఛికంగా తనిఖీలు నిర్వహించి లోపాలను మరో రెండు రోజుల్లోగా సరిదిద్దాలని ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిర్ణీత గడువులో అన్ని పనులను పూర్తి చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, సూపర్‌వైజర్లు బీఎల్‌వోలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులను పర్యవేక్షించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తికాగా, 80 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్తయిందని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ స్టేషన్‌ల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏలు) అందజేసి, వారి నుంచి తప్పనిసరిగా రసీదు లేదా సంతకం తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రభావం ఉంటుందనే తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఓటరు జాబితా సవరణకు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఈ విషయంలో తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఖండిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని, బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ ఎస్ఐఆర్ పురోగతిని వివరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 95 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ కూడా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కొనసాగుతోందని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు నమోదు చేసిన ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో డిజిటలైజేషన్, ధృవీకరణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలను పూర్తి చేసి ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎన్నికల విభాగం సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలనపై బీఆర్ఎస్ సమీక్ష

- మాజీ ఎమ్మెల్యే మెచ్చా.. రాష్ట్ర నాయకుడు ఉప్పల వెంకటరమణ భేటీ
- గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని బీఎల్ఏలకు ఆదేశం



**దమ్మపేట, జూలై 29(ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్) ప్రక్రియ పురోగతిపై బీఆర్ఎస్ నాయకత్వం దృష్టి సారించింది. పార్టీ రాష్ట్ర నాయకుడు, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఇంచార్జ్ ఉప్పల వెంకటరమణ బుధవారం దమ్మపేట మండలం తాటిసుబ్బనగూడెంలోని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నివాసంలో ఆయనతో సమావేశమై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఇప్పటివరకు ఆన్‌లైన్, డిజిటల్ విధానంలో పూర్తైన పరిశీలన శాతం, ఇంకా పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల వివరాలను పరిశీలించారు. ఎక్కడ ప్రక్రియ మందగమనంలో ఉందో తెలుసుకుని, వాటిని వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లతో (బీఎల్ఏలు) ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడిన నేతలు, కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల్లో సవరణలు, మరణించిన వారి పేర్ల తొలగింపు తదితర పెండింగ్ పనులను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటర్ల జాబితా సిద్ధం అయ్యేలా అప్రమత్తంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఉప్పల వెంకటరమణ, మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సమావేశంలో పగడాల నరేంద్ర, మాజీ మండల అధ్యక్షుడు దొడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్య ఏదైనా... మేమున్నాం అంటున్న నవచైతన్య యువకులు





**గుండాల జులై 29 ప్రజా జ్యోతి** కళ్ళ ముందు జరిగే మంచి చెడులను మనకేందిలే అంటూ వదిలేసే ఈ రోజులలో మేమున్నామంటూ చేయి కలుపుతున్న యువకులను శభాష్ అనక తప్పదు. నాటి కరోనా నుండి నేటి వరకు అనేక సమస్యలలో తమ వంతు చెయ్యి వేసి మేమున్నాం అంటూ ముందుకు వస్తున్న నవ చైతన్య యువజన సంఘాన్ని పలువురు కొనియాడుతున్నారు. నాటి కరోనాలో గర్భిణీ మహిళకు కరోనా పాజిటివ్ ఏర్పడడంతో కుటుంబీకులే దరిచేరక పోవడంతో నవ చైతన్య యువజన సంఘం నాయకులు దగ్గరుండి ఆ మహిళను ఇంటికి పంపించి నా ఘటన నుంచి ఆనాడు మాస్కులు, కూరగాయలు పంపిణీ చేయడంతో పాటు నేడు వేసవిలో మండల కేంద్రానికి వచ్చే అనేకమంది దహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు. గుండాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న అనేక మంది రోగులకు పాలు పండ్లు పంపిణీ చేయడం, ప్రవేట్ హాస్పటల్లో వైద్యం పొందుతున్న నిరుపేదలకు ఫండ్ కలెక్షన్ చేయడంలో ముందుండి నడిచిన వారిని అనేకమంది శభాష్ యువజనం అంటున్నారు. 2026 ఫిబ్రవరిలో అనేకమందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడంతోపాటు ప్రభుత్వ దవాఖానాలో సిబ్బంది లేని కారణంగా ఉన్నతాధికారులకు విన్నపాలు విన్నవించడం లోనూ ముందున్నారు. నిత్యం వర్షంలో నానుతూ సేవలందిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి బుధవారం నాడు రైన్ కోట్లను పంపిణీ చేయడం వారి పని తీరుకు మండల వాసులు శభాష్ నవ చైతన్య యోజన సంఘం యువకులకు అంటూ కొనియాడుతున్నారు కాగా నవ చైతన్య యోజన సంఘం ఎస్కే ఆజాద్, వినయ్, సంతోష్, ప్రణయ్, శశి,, రాజేష్, ఉదయ్, శోభన్, సతీష్‌లు అనేక సేవా కార్యక్రమాలలో ముందుంటూ సమస్యలే కాదు సహకారంలోను ముందుంటామంటూ ముందుకొస్తున్నారు. విద్యార్థులకు పెన్నులు ప్యాడ్స్ అందించడమే గాక విద్యా సమస్యలపై ఉన్నత అధికారులతో విన్నవించడానికి సైతం ముందుంటు సమస్యలేవైనా మేమున్నామంటున్నారు.

## అంగన్‌వాడీ చిన్నారులకు అల్పాహారం, యూనిఫాంల పంపిణీ

- **52వ డివిజన్ పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమం**
- **కార్పొరేటర్ బానోతు కళావతి, ధనరాజ్ చేతుల మీదుగా పంపిణీ**
- **చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపు**



**కొత్తగూడెం, జూలై 29, ప్రజాజ్యోతి ;** 52వ డివిజన్ పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అల్పాహారం, స్కూల్ యూనిఫాంల పంపిణీ కార్యక్రమాన్ని బుదువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 52వ డివిజన్ కార్పొరేటర్ బానోతు కళావతి, డివిజన్ నాయకుడు ధనరాజ్ పాల్గొని చిన్నారులకు స్వయంగా అల్పాహారం అందించి, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు ప్రాథమిక విద్యతో పాటు ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి చిన్నారి పరిశుభ్రమైన వాతావరణంలో మంచి విద్యను అభ్యసించేలా, అవసరమైన సౌకర్యాలు అందేలా అందరూ కృషి చేయాలని సూచించారు. చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించిన కార్పొరేటర్ బానోతు కళావతి, వారికి అందజేసిన యూనిఫాంలను వినియోగించుకోవాలని, క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరు కావాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పిల్లల ఆరోగ్యం, విద్యకు సంబంధించిన కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల, ధనలక్ష్మి , రఫియా, ఆయాలు షాహిన్, స్వరూప, 52వ డివిజన్ కార్యదర్శి ధనరాజ్, సహాయ కార్యదర్శి అజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం చిన్నారులతో కలిసి అల్పాహారం పంపిణీ చేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

## కొత్తగూడెం ఏరియా జీఎం శాలెం రాజుకు ఘన సన్మానం

- **ఉద్యోగుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనలో విశేష సేవలు అందించారని ప్రశంసలు**
- **సమిష్టి కృషితోనే సింగరేణి మరింత ముందుకు సాగుతుందని జీఎం శాలెం రాజు**

కొత్తగూడెం (సింగరేణి), జూలై 29, ప్రజాజ్యోతి : సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్‌గా సేవలందిస్తూ జూలై 31న పదవీ విరమణ చేయనున్న శాలెం రాజుకు ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ ఆధ్వర్యంలో సెంట్రల్, బ్రాంచ్, ఫిట్, ఆర్గనైజర్లు, ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శాలెం రాజుకు శాలువా కప్పి, పూల బొకే అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎం.డి. రజాక్ మాట్లాడుతూ శాలెం రాజు మూడు సంవత్సరాలుగా కొత్తగూడెం ఏరియాలో సమర్థవంతమైన పరిపాలన అందించారని అన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రుద్రంపూర్ డిస్పెన్సరీలో ఫిజియోథెరపీ విభాగం ఏర్పాటు చేయడం, రామవరం డిస్పెన్సరీని తిరిగి ప్రారంభించడం, గౌతంపూర్, రామవరం కమ్యూనిటీ హాళ్లలో వసతులు కల్పించడం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రొఫెసర్ జయశంకర్ క్రీడా మైదానంలో లైటింగ్ టవర్లు, ప్రహరీ నిర్మాణం, కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణ, ప్రగతి వనంలో దసరా, సింగరేణి దినోత్సవ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఉద్యోగులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు దేవాలయాలు, చర్చిలు, మసీదులకు సహకారం అందించారని, కార్మికులకు కొత్త క్వార్టర్ల నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. అధికారులు, కార్మిక సంఘాలతో సమన్వయం సాధిస్తూ కొత్తగూడెం ఏరియాను ఉత్పత్తి పరంగా ముందువరుసలో నిలిపేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. సన్మానానికి స్పందించిన శాలెం రాజు మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధి ప్రతి ఉద్యోగి సమిష్టి కృషిపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తే సంస్థ మరింత పురోగతి సాధిస్తుందని చెప్పారు. తన పదవీకాలంలో సహకరించిన అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు బుటిక రాజేశ్వరరావు, జిదుల రాజేశ్వరరావు, పోచం శ్రీనివాస్, విప్లవ్, భీముడు, నాగార్జున, కాసర్ల సమ్మయ్య, మేంగాని అశోక్, గోపు కుమారస్వామి, చిలక రాజయ్య, ఎం.డి. సత్తార్ పాషా, ఈ. మోహన్ రెడ్డి, కే. నట్రాజ్, సీహెచ్. సాగర్, మల్లికార్జున్, భరత్, భాను కమల్, కే. శ్రీనివాస్, సలిగంటి తిరుపతి, ఎస్.డి. యాకుబుద్దీన్‌తో పాటు పలువురు నాయకులు, ఉద్యోగులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



## 90 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ




**పినపాక, జూలై 29 (ప్రజాజ్యోతి)** పినపాక మండలంలోని తోగ్గుడెం గ్రామంలోని జీఎస్ఎస్ చైల్డ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం 90 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ యుపిఎస్ తోగ్గుడెం ప్రధానోపాధ్యాయులు సతీష్ విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. విద్యార్థులు విద్యలో రాణించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి. రాము, మురళీకృష్ణ రెడ్డి, తోగ్గుడెం సెంటర్ ఇన్‌చార్జ్ బడే సాగర్, ఉపాధ్యాయురాలు మైప రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- **వైద్యాధికారుల జూమ్ సమీక్ష సమావేశంలో డి ఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్**



**కొత్తగూడెం కలెక్టరేట్ , జులై 29, (ప్రజా జ్యోతి)** వర్షాకాలం కారణంగా జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల పర్యవేక్షణపై జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ బుధవారం వైద్యాధికారులతో జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు , ఏరియా ఆసుపత్రులు , టీచింగ్ ఆసుపత్రులు , జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులు , వైద్య కళాశాలలు, ప్రైవేట్ హాస్పిటళ్లు , ప్రైవేట్ క్లినిక్ లు తప్పనిసరిగా మూడు అంశాలను అమలు చేయాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రిలో కుక్క కాటు) మందులు అందుబాటులో ఉంచాలని, ప్రతి ఆసుపత్రిలో కుక్క కాటు కేసుల పర్యవేక్షణ కోసం ఒక నోడల్ అధికారిని నియమించాలనీఈ వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా నోటీసు బోర్డుపై ప్రదర్శించాలన్నారు, అదేవిధంగా, వైద్యాధికారులు తమ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లను రెండు వారాలకి ఒకసారి తప్పనిసరిగా తనిఖీ చేసి విద్యార్థులకు వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేయాలని, హాస్టల్ సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. హాస్టల్లో వంట చేసే వారికి తప్పనిసరిగా జుట్టు చేతి గోర్లు కత్తిరించుకోవాలని తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి జ్వరం, విరేచనాలు, వాంతులు, దగ్గు, జలుబు తదితర లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి వెంటనే సంబంధిత వైద్యాధికారికి సమాచారం అందించాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి చికిత్స అందించాలని సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం యాక్షన్ ప్లాన్ ప్రకారం నిర్వహించే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి వారాంత నివేదికలను సూపర్వైజర్లు, వైద్యాధికారులకు సమర్పించాలని తెలిపారు. ఆ నివేదికల ఆధారంగా వ్యాధులు అధికంగా నమోదవుతున్న గ్రామాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రోగ్రాం అధికారులు తమ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, ఎన్సీడీ స్క్రీనింగ్, శ్రమదానం, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ , ఆరోగ్య మహిళ, సికిల్ సెల్ స్క్రీనింగ్, టీబీ అనుమానితుల గుర్తింపు, రోగులకు మందుల పంపిణీ, వైద్య శిబిరాల నిర్వహణ తదితర కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు, సూచనలు అందిస్తూ నిరంతర సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని డాక్టర్ తుకారం రాథోడ్ సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం లేదా అలసత్వం ప్రదర్శించిన సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ఘనంగా గురుపూజా మహోత్సవం

- పూజల్లో పాల్గొన్న డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల, కార్పొరేటర్ విమలాదేవి





**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 29,(ప్రజా జ్యోతి)** పాత పాల్వంచ 46వ డివిజన్ పరిధి శ్రీ షిరిడి సాయిబాబా భజన మందిరంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఘనంగా గురు పూజా మహోత్సవం పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయం ధర్మకర్త ముత్యాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు చిలుకూరి దినకరశాస్త్రి, అర్చకులు దాసోజు సతీష్,ఆచార్యులు బుధవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదకొండు రకాల ద్రవ్యాలతో అభిషేకం, పదకొండు రకాల పండ్లు, పదకొండు రకాల స్వీట్లు, ఐదు రకాల నైవేద్యాలతో మహా నైవేద్యం లు నిర్వహించారు. పదకొండు రకాల పుష్పాలతో పూలాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. పదకొండు మంది వివిధ దేవాలయాల అర్చకులకు, ధర్మకర్తలను సన్మానించారు. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే ఐదుగురు ఉపాధ్యాయులను, దంపతులను సన్మానించారు. ఈ ప్రత్యేక పూజల్లో డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కొత్వాల దంపతులకు ఘన సన్మానం తో పాటు గురు పౌర్ణమి సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు, విమలాదేవిలను శాలువ, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త ముత్యాల కోటేశ్వరరావు, కృష్ణవేణి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి పంచాయతీ సర్పంచులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

- పాల్వంచ మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న కొత్వాల

**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 29,(ప్రజాజ్యోతి)** గ్రామాల అభివృద్ధి స్థానిక సమస్యల పరిష్కారం వలనే సాధ్యమవుతుందని, గ్రామాల అభివృద్ధికి పంచాయతీ సర్పంచులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం సాయంత్రం ఎం.పీ.డీ.వో కార్యాలయంలో నిర్వహించారు, సమావేశంలో పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ పంచాయతీ సర్పంచులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ప్రజలు చెప్పిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదని వరి పంటకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా తగు జాగ్రత్తలు సూచించాలన్నారు. త్రాగునీటి సరఫరాకు ఇబ్బంది అవ్వకుండా భూగర్భ జలాలు పెంపొందించే విధంగా జలసిరి ఇంకుడు గుంతలు వేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ సర్ లో ఓటర్ల నమోదుకు సమయం సమీపిస్తున్నందున ఆగస్టు 3వ తేదీ లోపు ఓటర్లు నమోదుకు సహకరించాలని కొత్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ.సీ.ఈ.వో నాగలక్ష్మి, ఎం.పీ.డీ.వో రాజారావు, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, రూరల్ ఎస్సై సురేష్, సి.డి.పి.ఓ లక్ష్మీ ప్రసన్న, వ్యవసాయ శాఖ అధికారి పి.శంభోశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 29, (ప్రజా జ్యోతి)** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాలు అధికంగా నమోదవుతున్న బ్లాక్ స్పాట్ల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రహదారులపై పశువుల సంచారం అధికంగా ఉండటం వల్ల, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు . రహదారులపై పశువులను నిర్లక్ష్యంగా వదిలే యజమానులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అతివేగంగా వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు అప్పగించడం, సీటు బెల్టులు ధరించకపోవడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు వినియోగించకపోవడం వంటి ఉల్లంఘనలను అరికట్టేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, కట్టుదిట్టమైన అమలు చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 42 బ్లాక్ స్పాట్లలో భద్రతా చర్యలకు సంబంధించిన పనులను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరికలు, సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా రహదారుల వెంట ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చివేయాలని, రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి వాహనదారులకు స్పష్టమైన దృశ్యమానత కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు.ప్రమాదాలు సంభవించినప్పుడు క్షతగాత్రులకు 'గోల్డెన్ అవర్'లో సకాలంలో వైద్య సేవలు అందేలా బ్లాక్ స్పాట్లకు సమీపంలోని ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో జనవరి నుండి ఇప్పటివరకు 289 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయని అధికారులు వివరించారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలను ఆన్లైన్ పోర్టల్లో ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు వేణుగోపాల్, ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి వి వెంకటరమణ, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి అనూష సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారి దుస్థితిపై బీఆర్ఎస్ ఆందోళన

- గుంతలమయంగా మారిన రహదారితో ప్రజలకు ఇబ్బందులు
- వర్షాలతో రాకపోకలు మరింత కష్టంగా మారిన పరిస్థితి
- వెంటనే మరమ్మతులు చేపట్టాలని ముద్దంగుల మహేష్ డిమాండ్



**కొత్తగూడెం, జూలై 29, ప్రజాజ్యోతి :** పట్టణంలోని గణేష్ టెంపుల్ నుంచి మేదర బస్తీ, గొల్లగూడెం ప్రగతినగర్ వరకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రజలకు నిత్య నరకయాతనగా మారిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. 53వ డివిజన్ బీఆర్ఎస్ ఇంచార్జి ముద్దంగుల మహేష్ ఆధ్వర్యంలో నాయకులు దెబ్బతిన్న రహదారిని పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రహదారి మరింత అధ్వాన్నంగా మారిందని, అడుగడుగునా గుంతలు, బురద పేరుకుపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మహేష్ తెలిపారు. ఈ మార్గంలో ప్రతిరోజూ విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుండగా, సమీపంలో బ్యాంకులు, ఆసుపత్రులు, వ్యాపార సంస్థలు ఉండటంతో రద్దీ కూడా ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని, అత్యవసర సేవల రాకపోకలకు కూడా ఆటంకం కలుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ ప్రధాన రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టి సురక్షిత రవాణా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 30వ డివిజన్ బీఆర్ఎస్ ఇంచార్జి జున్నూరు రాజేష్, 54వ డివిజన్ బీఆర్ఎస్ ఇంచార్జి మాదా సు పద్మ, ముద్దంగుల భాస్కర్, ఆవుల ప్రవీణ్, మీసా శ్రీశైలం, తూములూరు శీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ రవిదాస్ మహారాజ్ జయంతి వేడుకలు

- బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో 650వ జయంతి నిర్వహణ
- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి
- రవిదాస్ ఆశయాలు సమాజానికి ఆదర్శమని వెల్లడి

**లక్ష్మీదేవిపల్లి, జూలై 29, ప్రజాజ్యోతి ;** భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాకేష్ బాబు ఆధ్వర్యంలో సంత్ శిరోమణి శ్రీ రవిదాస్ మహారాజ్ 650వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంత్ రవిదాస్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, దీప ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సంత్ రవిదాస్ మహారాజ్ సమాజంలో సమానత్వం, సోదర భావం నెలకొల్పేందుకు విశేష కృషి చేశారని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా సమాజ నిర్మాణం కోసం ఆయన జీవితాంతం పాటుపడ్డారని పేర్కొన్నారు. ఆయన చూపిన భక్తి మార్గం, సమతా సిద్ధాంతాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సంత్ రవిదాస్ ఆశయాలకు అనుగుణంగా "సబ్కా సాత్.. సబ్కా వికాస్" లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రవిదాస్ మహారాజ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పెద్దలు, గురువులను శాలువాలతో సన్మానించి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు మోహనకృష్ణ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, ధార్మిక సెల్ అధ్యక్షుడు సుధాకర్, జిల్లా కార్యాలయ కార్యదర్శి దొరిశెట్టి కుమార్, యోగ గురువు గుమలాపురం సత్యనారాయణ, నల్లగట్ల తిరుపతయ్య, ముత్యాల వంశీ, భూక్య మోహన్, బానోత్ కుమార్, వీర ప్రతాప్, చర్ల రమేష్ బాబు, నారపోగు రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



# మండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యానికి చెక్
- పెండింగ్ పనులు వేగవంతం చేయాలి
- లబ్ధిదారులకు ఇబ్బందులు ఉండొద్దు: ఎమ్మెల్యే కోరం కనకయ్య





**టేకులపల్లి, జూలై 29,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధికారులను ఆదేశించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన వివిధ శాఖల పనితీరును సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ప్రత్యేకంగా ఆరా తీసిన ఎమ్మెల్యే, పనులు జాప్యం అవుతున్న ప్రాంతాల్లో వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టి నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. పునాది దశ నుంచి పైకప్పు వరకు నిర్మాణాల పురోగతి, నిధుల వినియోగం, లబ్ధిదారులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ పెండింగ్ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని ఆదేశించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడుపరిష్కరించాలని, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యానికి తావివ్వొద్దని స్పష్టం చేశారు.సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్,ఎంపీడీవో శ్రీదేవి,సబ్ఇన్‌స్పెక్టర్ తిరుపతి, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్ నాయక్, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐటీసీ సాయంతో నూతన అంగన్ వాడీ భవనం ప్రారంభం



**బూర్గంపహాడ్, జూలై29 (ప్రజా జ్యోతి ):** మండలంలోని సారపాక గ్రామ పంచాయతీ పరిధి గాంధీనగర్ ఒడియా క్యాంప్ లో ఐటీసీ 'మిషన్ సునేహ్రా కల్', వాష్ ఇన్ స్టిట్యూట్ సంయుక్త సహకారంతో హెచ్ డీఎఫ్ సీ–ఐటీసీ సీఎస్ ఆర్ నిధుల ద్వారా రూ.11.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అంగన్ వాడీ భవనాన్ని బుధవారం సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనిన్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ, ఐటీసీ సంస్థ సీఎస్ ఆర్ నిధుల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, నాణ్యమైన విద్య, మౌలిక వసతుల కల్పనలో విశేష సేవలు అందిస్తోందని ప్రశంసించారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్న సంస్థలను గౌరవించి, వాటి సహకారంతో గ్రామాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.తన ఏడు నెలల పదవీకాలంలోనే సుమారు రూ.8.50 కోట్ల అభివృద్ధి నిధులతో 130 సీసీ రోడ్లు, 150 కిలోమీటర్ల డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి సారపాకను మట్టి రోడ్లు లేని గ్రామంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. బసప్ప క్యాంప్ లో రూ.25 లక్షలతో భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.కార్యక్రమంలో సీడీపీవో మంగతాయారు, వార్డు సభ్యురాలు ఉమ, ఐటీసీ చీఫ్ మేనేజర్ చెంగలరావు, ఎంఎస్ కే ప్రోగ్రామ్ మేనేజర్ జయప్రకాశ్, ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ గీత, తార ప్రసాద్, వాష్ ఇన్ స్టిట్యూట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.ఆర్. బాలకృష్ణ, ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వార్డు సభ్యులు, అంగన్ వాడీ సూపర్ వైజర్లు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రజలకు అవగాహన సదస్సులు కరువయ్యాయి..!

- వైద్యాధికారులు ఉన్నట్లా... లేనట్లా..?
- సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా ఆచరణ శూన్యం..!
- దోమల నివారణకు పిచికారీ జాడే లేదు..!
- కలుషిత తాగునీటి నివారణకు ముందస్తు చర్యలు కరువు..!



**అశ్వాపురం, జులై 29, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని గ్రామాల్లో ప్రజల ఆవేదన...భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని పలు గ్రామాల్లో వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి సీజనల్ వ్యాధులు విజృంభించే పరిస్థితులు నెలకొన్నప్పటికీ, వైద్య ఆరోగ్య శాఖతో పాటు సంబంధిత పంచాయతీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.వర్షాల ప్రభావంతో గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయిలో సమావేశాలు, ఆరోగ్య సదస్సులు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటివరకు ఏ గ్రామంలోనూ అలాంటి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు...గ్రామాల్లో నిల్వ నీరు పేరుకుపోవడం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం, చెత్తాచెదారం తొలగించకపోవడం వల్ల దోమల ఉద్ధృతి రోజురోజుకు పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. దోమల నివారణ కోసం ఫాగింగ్, పురుగుమందుల పిచికారీ, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు కూడా చాలా గ్రామాల్లో కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా, తాగునీటి వనరులు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు కూడా అధికారులు విస్మరించారని ప్రజలు పేర్కొంటున్నారు. బోర్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి నిల్వ కేంద్రాల పరిశుభ్రతపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల వ్యాధులు మరింత వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం గ్రామాల్లో ఇంటింటా జ్వరాల బారిన పడుతున్న వారు పెరుగుతున్నారని, కొందరిలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాల లక్షణాలు కనిపిస్తున్నప్పటికీ, వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడం, ఇంటింటా సర్వేలు చేపట్టడం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో గ్రామాల్లో వెంటనే అవగాహన సదస్సులు నిర్వహించాలని, దోమల నివారణకు ఫాగింగ్, పిచికారీ చేపట్టాలని, నిల్వ నీటిని తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, తాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రూ.59 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- పలు డివిజన్లలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం
- బర్మా క్యాంపులో కార్మిక సంక్షేమ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కూనంనేని శంకుస్థాపన
- నాణ్యతతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు ఆదేశం



**కొత్తగూడెం, జూలై 29, ప్రజాజ్యోతి ;**అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.59 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎస్సీబీ నగర్ 14వ డివిజన్, పాత కొత్తగూడెం 12వ డివిజన్, 10వ డివిజన్ బూడిదగడ్డ, 58వ డివిజన్ హనుమాన్ బస్తీ, 49వ డివిజన్ హనుమాన్ బస్తీలో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం 24వ డివిజన్ బర్మా క్యాంపు ప్రాంతంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న కార్మిక సంక్షేమ భవనానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతుల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీలు, సంక్షేమ భవనాల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని సూచించారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను స్థానిక ప్రజలు కూడా పరిశీలించి అవసరమైన సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు కూరపాటి సుధాకర్, పొలమూరి ధనలక్ష్మి, బోయిన విజయ్ కుమార్, సుప్రియ, నాయకులు ఎస్.కే. ఫహీమ్, భూక్య శ్రీనివాస్, యూసుఫ్, గోపీకృష్ణ, గుత్తుల శ్రీను, ఖయ్యూం, మండల రాజు, రాజేందర్, వాడే రాములు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు సమాన హక్కులు కల్పించాలి

**కొత్తగూడెం, జూలై 29, ప్రజాజ్యోతి ;**ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న దళితులకు అన్ని రంగాల్లో సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక శేషగిరి భవన్‌లో జరిగిన డీహెచ్‌పీఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో కూడా దళితులకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించకుండా దళితుల అభివృద్ధికే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం డీహెచ్‌పీఎస్ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆగస్టు 3న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని జిల్లాలోని దళితులు, యువత, మహిళలు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రత్నకుమారి, జిల్లా అధ్యక్షుడు దొంతమాల చెన్నయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

- **గంజాయిని విక్రయిస్తున్నారని సమాచారంతో నార్కోటిక్ స్క్వాడ్ డాగ్ తో తనిఖీలు**



**అశ్వాపురం, జులై 29, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు,మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆదేశాల ప్రకారం, అశ్వాపురం సిఐ ఎల్లయ్య సూచనల మేరకు బుధవారం అశ్వాపురం మండలంలో పోలీసు సిబ్బంది తో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గంజాయి సేవించిన విక్రయించిన, అక్రమంగా నిల్వ చేయడం వంటి కార్యకలాపాలపై ముందస్తు సమాచారం ఆధారంగా అనుమానిత ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాలు, కిరాణా దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌ను వినియోగించారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో గంజాయిని ఎక్కడ దాచి ఉంచినా సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని అశ్వాపురం ఎస్ఐ రాజేష్ తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే అశ్వాపురం పోలీసులకు అందించాలని ప్రజలకు ఎస్ఐ రాజేష్ విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

# పౌర్ణమి వేళ వైభవంగా చండీ హోమం

- **మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, దక్షిణా మూర్తికి విశేష పూజలు**



**అన్నపురెడ్డిపల్లి, జూలై 29 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాన్ని వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. అనంతరం దక్షిణా మూర్తి స్వామికి విశేషపూజలు చేశారు. పౌర్ణమి సందర్భంగా చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమంలో గ్రామస్థులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమ పూర్ణాహుతి అనంతరం ఆలయ ప్రాంగణంలో తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి. ఆలయ నిర్వహణ ఏర్పాట్లను మేనేజర్ పి.వి. రమణ పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

# గురు పౌర్ణమి సందర్భంగా గురువులకు ఘన సన్మానం

- **బంజారా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం**
- **మంచి సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అమూల్యమని నేతల అభిప్రాయం**



**లక్ష్మీదేవిపల్లి, జూలై 29, ప్రజా జ్యోతి :** మంచి సమాజ నిర్మాణంలో గురువులు కీలక పాత్ర పోషిస్తున్నారని బంజారా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ భానోత్ వీరు నాయక్, కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్ సింగ్ అన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని కొత్తగూడెం మార్కెట్ కమిటీ యార్డులో బంజారా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బంజారా ధర్మ గురువులు, సాధువులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువులు అందించే జ్ఞానం, విలువలు సమాజ అభివృద్ధికి పునాదులని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో గురువులకు విశిష్ట స్థానం ఉందని, వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. యువత మంచి మార్గంలో నడవాలంటే గురువుల మార్గదర్శకత్వం ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్ నాయక్, భూక్య మోహన్ రాథోడ్, బాలకృష్ణ చౌహాన్, బాబులాల్ నాయక్, బద్రు నాయక్, చందర్ నాయక్, రమేష్ నాయక్, వినోద్ నాయక్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ నాయక్, బానోత్ రమేష్ నాయక్, మోహన్ నాయక్, రాంబాబు, భద్ర జగదాంబ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు తేజావత్ రాములు మహారాజ్, రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ మహారాజ్, సాధువుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ సాదు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురు సాదు, జిల్లా అధ్యక్షుడు మాలోత్ రమేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య బాలు సాదు, బధ్య, లచ్చు సాదు, వాంకుడోత్ బాలు సాదు, భానోత్ కిసన్ సాదు, లకావత్ దసరా సాదు, సోమ్లా సాదు, గూగులోత్ లింగ, బాలు సాదు, ఇస్లావత్ కిరు, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట తహశీల్దార్‌గా మద్దినేని మురళి రాకతో మార్పుల బాట

- **లంచాలకు చెక్.. భూ సమస్యల పరిష్కారానికి వేగం..**
- **తహసీల్దార్ కార్యాలయ పరిశుభ్రత.. తాగునీటి కోసం బోర్‌వెల్ ఏర్పాటు**





**దమ్మపేట, జూలై 29(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండల నూతన తహశీల్దార్‌గా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెవెన్యూ కార్యాలయంలో వరుస మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పారదర్శక పాలన, ప్రజలకు మెరుగైన సేవలు, అవినీతికి అడ్డుకట్ట, పెండింగ్ భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తనదైన ముద్ర వేస్తున్నారు.బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే "లంచం ఇవ్వొద్దు..లంచం తీసుకోవద్దు" అనే సందేశంతో ప్రత్యేక ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవినీతిపై తన వైఖరిని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును వేగంగా పరిష్కరించాలని, దళారి వ్యవస్థ నిర్మూలన , భూ వివాదాలు సంబంధించిన అంశాల్లో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించారు. ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పుడు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టారు.కార్యాలయంలో నెలకొన్న తాగునీటి సమస్యను కూడా అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్నారు. తహశీల్దార్ మద్దినేని మురళి ఆదేశాల మేరకు దమ్మపేట గ్రామ సర్పంచ్ పగడాల రమాదేవి–రాంబాబు ప్రత్యేక చొరవ తీసుకుని రెవెన్యూ కార్యాలయ ఆవరణలో బోర్‌వెల్ తవ్వించారు. తహశీల్దార్, సర్పంచ్ కొబ్బరికాయలు కొట్టి బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. దీంతో కార్యాలయ సిబ్బందితో పాటు ప్రజలకు కూడా శాశ్వత తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానుంది. చాలా కాలంగా ఉన్న నీటి సమస్య పరిష్కారం కావడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అవినీతికి తావులేకుండా పారదర్శక పరిపాలన, ప్రజల భూ సమస్యల సత్వర పరిష్కారం, కార్యాలయ పరిశుభ్రత, తాగునీటి వంటి ప్రాథమిక సౌకర్యాల కల్పనతో నూతన తహశీల్దార్ మద్దినేని మురళి తీసుకుంటున్న చర్యలు మండల ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి. రెవెన్యూ శాఖలో ప్రారంభమైన ఈ మార్పులు భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా కీలక అడుగులుగా నిలుస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# పారదర్శకంగా లాటరీ పద్ధతిలో ద్విచక్ర, మూడు చక్రాల వాహనాల లబ్ధిదారుల ఎంపిక

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 29, (ప్రజాజ్యోతి )** ప్రధాన మంత్రి జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియ పథకం కింద మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదల, ఆదాయ వృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం మంజూరు చేసిన ద్విచక్ర, మూడు చక్రాల వాహనాల లబ్ధిదారులను బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అధ్యక్షతన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో పారదర్శకంగా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు కమిటీ సమక్షంలో లాటరీ విధానాన్ని అనుసరించి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ అర్హులైన ప్రతి మత్స్యకారుడు ప్రభుత్వ సహాయాన్ని పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా మత్స్యశాఖ అధికారి జి. శివ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ద్విచక్ర వాహనాల కోసం 274 మంది మత్స్యకారులు, మూడు చక్రాల వాహనాల కోసం 26 మంది మత్స్యకారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మత్స్యశాఖ డైరెక్టర్, హైదరాబాద్ కార్యాలయం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 51 ద్విచక్ర వాహనాలు, 12 మూడు చక్రాల వాహనాలు కేటాయించినట్లు తెలిపారు. కేటాయించిన వాహనాల సంఖ్య కంటే దరఖాస్తులు అధికంగా రావడంతో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. లాటరీ ప్రక్రియను కమిటీ సభ్యులు, జిల్లా మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు, మత్స్యకారుల సమక్షంలో పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించి ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ఖరారు చేసినట్లు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు తదుపరి ప్రక్రియ పూర్తి చేసి వాహనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, డీఆర్ డీఓ ఎం. విద్యా చందన, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి. నాగలక్ష్మి , జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి కె. మహేశ్వరరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వి. రామిరెడ్డి, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్, జిల్లా మత్స్యశాఖ అధికారి జి. శివ ప్రసాద్ (కన్వీనర్), ప్రగతిశీల మత్స్యకారుడు పిట్టల సాయిలు, జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు, మత్స్యకారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నీనో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి






- గ్రామ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి..
- మండల స్థాయి సమావేశంలో అధికారులకు, సర్పంచులకు ప్రత్యేక అధికారి రవికుమార్ సూచనలు

**దమ్మపేట, జూలై 29(ప్రజాజ్యోతి):** ఎల్‌నీనో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మండల స్థాయి సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. గ్రామాభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలు, శాఖల వారీ పనుల పురోగతిపై బుధవారం దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి రవికుమార్ అధ్యక్షతన మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్ మద్దినేని మురళి, ఎంపీడీఓ బి. రవీంద్రరెడ్డి, వివిధ శాఖల మండల అధికారులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నీనో ప్రభావం కారణంగా సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు తగ్గిన నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. రైతులకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించి, శాస్త్రీయ సలహాలతో సాగు చేపట్టేలా వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తయ్యేందుకు సంబంధిత గ్రామ పంచాయతీలు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూసేకరణ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి అపోహలు లేకుండా అవగాహన కల్పించి ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని సూచించారు. గ్రామ పంచాయతీలపై విద్యుత్ బిల్లుల భారం పెరుగుతున్న నేపథ్యంలో వీధి దీపాలు, నీటి మోటార్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించారు. అవసరమైన సమయాల్లో మాత్రమే వీధి దీపాలు వెలిగించడం, మోటార్లను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. గ్రామాల్లో కోతులు, వీధి కుక్కల బెడద అధికమవుతోందని పలువురు సర్పంచులు సమావేశంలో ప్రస్తావించారు. ప్రజల భద్రత దృష్ట్యా వీధి కుక్కలకు సంతానోత్పత్తి నియంత్రణ (స్టెరిలైజేషన్) కార్యక్రమాలు, వ్యాక్సినేషన్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, కోతుల సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. తహశీల్దార్ (ట్రైనీ డిప్యూటీ కలెక్టర్) మద్దినేని మురళి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అన్ని శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. రెవెన్యూ సేవలను పారదర్శకంగా, జాప్యం లేకుండా ప్రజలకు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు భూసేకరణ పనులకు గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని సూచించారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు అధికారులు అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఎంపీడీఓ బి. రవీంద్రరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల కల్పన, పచ్చదనం పెంపు వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యుత్ వినియోగంలో పొదుపు చర్యలు పాటించడం ద్వారా గ్రామ పంచాయతీల ఆర్థిక భారం తగ్గించవచ్చన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సకాలంలో అందించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. మండల ప్రత్యేక అధికారి రవికుమార్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతాయని అన్నారు. గ్రామాల్లో నెలకొనే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని, సీతారామ ప్రాజెక్టు భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా గ్రామ పంచాయతీలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామాల్లోని సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమీక్ష నిర్వహించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.

# పేదల వైద్యానికి అండగా ఎమ్మెల్యే జారే





- సచివాలయంలో 278 సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల సమర్పణ..
- నిమ్స్ లో రోగికి రూ.2.50 లక్షల ఎల్‌వోసీ అందజేత

**దమ్మపేట, జూలై 29(ప్రజాజ్యోతి):** నియోజకవర్గంలో ఎవరైనా పేద లేదా సామాన్య కుటుంబానికి చెందిన వ్యక్తి అనారోగ్యానికి గురై వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందేలా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రజా సేవలో తన నిబద్ధతను చాటుకున్నారు. వైద్య ఖర్చులు భారంగా మారి చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతో బుధవారం హైదరాబాద్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొని బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా తెలంగాణ సచివాలయంలో అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన 278 మంది అనారోగ్య బాధితుల సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను సంబంధిత అధికారులకు స్వయంగా అందజేశారు. ప్రతి అర్హుడికి త్వరితగతిన సహాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం అన్నపురెడ్డిపల్లి మండలం జానకిపురం గ్రామానికి చెందిన కట్టం రవి గుండె శస్త్రచికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లి పరామర్శించారు. చికిత్స కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)ని స్వయంగా అందజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దీంతో చికిత్స ఖర్చుల విషయంలో ఆ కుటుంబానికి గణనీయమైన ఆర్థిక ఊరట లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఏ కుటుంబానికీ వైద్యానికి అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన ప్రతి బాధితుడికి సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. తాను ప్రజల మధ్య నుంచి వచ్చిన వ్యక్తినని, వారి కష్టసుఖాలు ప్రత్యక్షంగా తెలుసని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా ఉన్నా లేకపోయినా ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని, పదవులు శాశ్వతం కాకపోయినా ప్రజలకు చేసిన మంచి మాత్రమే చిరస్థాయిగా నిలుస్తుందని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కుటుంబ సభ్యుడిగా ప్రతి అవసరంలో అండగా నిలుస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## ఆశ్రమ పాఠశాలల భాషా పండితులు, పీఈటీల పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలి

- ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, డాక్టర్ గారికె శ్రీనివాస్



**ములకలపల్లి, జూలై 29, ప్రజాజ్యోతి:** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు, పీఈటీల 437 పోస్టులను ప్రభుత్వం వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్ డాక్టర్ గారికె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికే జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లోని 10,479 పోస్టులను అప్‌గ్రేడ్ చేసినప్పటికీ, గిరిజన సంక్షేమ శాఖలోని 437 పోస్టులను మాత్రమే పెండింగ్‌లో ఉంచడం వివక్షపూరితమని ఆయన ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల ఆశ్రమ పాఠశాలల్లో భాషా పండితులు, పీఈటీలు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కీలక సేవలందిస్తున్నారని తెలిపారు. వారి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటికీ స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న 437 పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డాక్టర్ గారికె శ్రీనివాస్ కోరారు.